# కృష్ణం వన్దే జగద్గురుమ్ – 3

శ్రీమద్భాగవతములోని కథ

శ్రీకృష్ణుడు బాలురందఱిలోనూ చాలా ఉత్తముడు. ఆతని బాల్యక్రీడలు లోకహితార్థములైన మహోపదేశాలే కాని అల్లరి పనులు కావు. విష్ణుమాయచే మోహితులైన గోపికలు శ్రీకృష్ణుడు ఒక బాలుడని భ్రమిసినారే కానీ ఆదిమధ్యాంతరహితుడైన పరబ్రహ్మ అని తెలుసుకోలేక పోయారు. ఆతని అల్లరి పనులు నిజమేనని నమ్మారు. చిన్నికృష్ణుని దుండగాలు సహించలేని ఒక గోపిక యశోదతో ఇలా మొఱబెట్టుకున్నది

*మీ పాపఁడు మా గృహముల*
*నా పోవఁగ బాలు ద్రావ నగపడ కున్నం*
*గోపించి పిన్నపడుచుల*
*వాపోవఁగఁ జిమ్ముకొనుచు వచ్చెం దల్లీ!*

"ఓ తల్లీ! యశోదా! మీ పిల్లవాడు మా గృహములోకి వచ్చి తనకు తృప్తిదీరా త్రాగుటకు సరిపోవు పాలు లేవని కోపించినాడు. పసిబిడ్డలని కూడా చూడకుండా కోపముతో వారిని పడదోసుకుంటూ బయటికి వచ్చేశాడు. వాళ్ళు పాపం గుక్కపట్టి ఏడ్చారు. అమ్మా! నీవూ ఒక తల్లివే కదా? మా బాధను అర్థంచేసుకోలేవా?".

**పిల్లలూ! మరి జగద్గురుపైన శ్రీ కృష్ణుడు ఈ కథ ద్వారా ఏమి బోధించాలనుకున్నాడో తెలుసుకుందామా?**
గృహస్థధర్మాలలో అతి ముఖ్యమైన అంశం గురించి శ్రీకృష్ణ గురువర్యుడు మనకీ కథలో బోధించినాడు. గృహస్థులు తమ పిల్లలను సంసారమును పోషించుకొనుటే కాక ఇంటికి వచ్చిన వారిని ముఖ్యముగా పిల్లలను వృద్ధులను అతిథులను అర్థులను సంతృప్తి పఱచవలెను. అట్లుచేయకుండిన వంశక్షయము కలుగునని శ్రీకృష్ణ గురుదేవుని సందేశము. చిన్న పిల్లవాడైన తనకు కావలిసినవి పాలు. ఆ ఇంటి యజమాని తన పిల్లలకు పాలు ఉన్నాయో లేవో చూచుకున్నాడు కానీ తన ఇంటికి ఆడుకొనుటకు వచ్చే భగవత్స్వరూపులైన బాలకులకు పాలు ఉన్నాయోలేవో చూసుకొనలేదు. అందుకనే కన్నయ్య వారినారీతిలో శిక్షించి కాపాడినాడు.

అందుకనే మన పెద్దలు ముఖ్య అవసర వస్తువులైన ధాన్యం పసుపు–కుంకుమ పాలు–పెరుగులు ఎప్పుడూ ఇంట్లో లేకుండా ఉండకూడదని అంటారు. ఒకవేళ అవి లేకపోతే "నిండుకు ఉన్నాయి" అని అంటారే తప్ప "లేవు" అని అనరు. అట్టి వస్తువులను త్వరగా సంపాదించి తమ అవసరాలకోసమే కాక ఇంటికి వచ్చిన అర్థులకోసం కూడా ఉంచుకోవాలన్నదే వారి తాత్పర్యం. పూర్వం ఏ మాదాకబళం వాడు వస్తాడో ఏమో అని కొంచం అన్నం మిగిల్చేవారు. ఎప్పుడూ తినే పదార్థాలను పూర్తిగా వినియోగించుకునేవారు కాదు. అట్లా చేయుట వలన అనుకోకుండా వచ్చే అర్థులను కూడా తృప్తి పఱచవచ్చని వారి ఆలోచన. కాబట్టి మనమెన్నడూ అత్యవసర పదార్థాలను అర్థులకోసం దాచి ఉంచుకోవాలని జగద్గురుపైన శ్రీకృష్ణుని సందేశం.